క్లుప్తంగా

ఘనంగా అగ్ని ప్రతిష్ఠ.. మూర్తి కుంభ స్థాపన



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహక్షేత్రంలో రెండో రోజు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా జరిగాయి. మంగళవారం ఉదయం రుత్వికులు మూర్తి కుంభస్థాపన, అగ్నిప్రతిష్ఠ చేశారు. ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. లక్ష్మీసమేత నృసింహ స్వామి విశేషాలంకృతులై భక్తులకు దర్శనమిచ్చారు.

ఫైర్ స్టేషన్ లేక తీవ్ర నష్టం

- సీపీఎంజిల్లా నేత భాస్కర్



దౌల్తాబాద్(దుబ్బాక): మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ లేక పోవడంతో తీవ్రమైన నష్టం జరుగుతోందని, వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.భాస్కర్ డిమాండ్ చేశారు. రెండు రోజుల క్రితం పబ్బ అశోక్ ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధం కావడం చాలా బాధాకరమన్నారు. ఫైర్ సిబ్బందికి పలుమార్లు సమాచారం అందించినా గంట వరకు రాకపోవడంతో ప్రమాద స్థాయి పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబానికి రూ.20 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని, మండల కేంద్రంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



రిమ్మనగూడ గ్రామంలో డ్రైడే కార్యక్రమం

గజ్వేల్: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చునని వైద్యారోగ్యశాఖ సబ్ యూనిట్ అధికారి బి.శ్రీనివాస్ సూచించారు. డ్రై డే కార్యక్రమంలో మంగళవారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామాన్ని సందర్శించి సీజనల్ వ్యాధుల వ్యాప్తి, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఉధృతంగా ప్రబలే ప్రమాదముందన్నారు. మంచి నీటి కాచి వడపోసి తాగాలని, దోమతెరలు వాడాలని సూచించారు. ఎంపీహెచ్ఈఓ ప్రేమ్ చంద్, ఏఎన్ఎమ్ మంజుల, హెల్త్ అసిస్టెంట్ దుర్గాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వృక్షశాస్త్ర విభాగంలో శిక్షణ

ప్రిన్సిపాల్ సునీత



సిద్దిపేటఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎక్స్‌ప్లోరింగ్ ద బొటానికల్ వరల్డ్, ఏ హ్యాండ్స్ ఆన్ అడ్వెంచర్' అనే అంశాలపై రెండు రోజుల పాటుగా శిక్షణ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, కార్యశాల కన్వీనర్ డాక్టర్ కొమ్మిడి రాణి మంగళవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈ శిక్షణకు వివిధ యూనివర్సిటీల నుంచి ప్రొఫెసర్‌లు, శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కార్యశాల ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ అవుదారి శైలజ, కో–కన్వీనర్లు డాక్టర్ మిరాజ్ ఫాతిమా, స్రవంతి, డాక్టర్ మోతుకు శ్రీనివాస్, డాక్టర్ దువ్వల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల జేఏసీ ఎన్నిక



స్వాతంత్ర్య సమరయోధుడు గాల్‌రెడ్డిని సన్మానిస్తున్న జేఏసీ సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం సిద్దిపేటలో అధ్యక్షురాలు స్వరూపరాణి ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా చెన్నోజు సుదర్శన్, కో కన్వీనర్‌లుగా అన్వర్ పటేల్, శ్రీకాంత్, ముగిలి భిక్షపతి, మారెడ్డి రామలింగారెడ్డి, కృష్ణగౌడ్, పంబాల చిత్ర, మన్నే గణేశ్, సలహాదారులుగా వంగ గాల్‌రెడ్డి, కాళిప్రసాద్, ఎల్లారెడ్డిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రామిరెడ్డి, ప్రసాద్, లావణ్య, తుల్జారెడ్డి, బాల్‌లక్ష్మి, సుజు, లలిత, సుచరిత, యాదగిరి, నర్సింహులు, బైరాగి పాల్గొన్నారు.



సాముహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

ఘనం.. మంగళ గౌరి వ్రతం

శ్రావణ మంగళవారం సందర్భంగా గౌరీ నీలకంఠేశ్వర ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళ గౌరీవ్రతం ఆచరిస్తే అంతా శుభమే జరుగుతుందని వారి విశ్వాసం. దీంతో మంగళవారం ఉదయం నుంచే ఆలయాల వద్ద మహిళల సందడి నెలకొంది. సామూహిక కుంకుమార్చన, మంగళ గౌరీ వ్రతాలాచరించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు అందించారు.

– ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



ప్రత్యేక అలంకరణలో గౌరీ మాత

వర్షాకాలం.. జర పైలం

సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం

- పరిసరాలు, వ్యక్తిగత శుభ్రత అవసరం
- కలుషిత నీరు, ఆహారం తినవద్దు
- రోగాల బారిన పడితే నిర్లక్ష్యం వద్దు

వర్షాకాలం.. వ్యాధులకు ఆజ్యం పోసే సమయం. పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోతే అనారోగ్యం పాలవుతాం. పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోతే దోమలు విజృంభిస్తాయి. దీంతో వివిధ రకాల వ్యాధుల బారిన పడతాం. అలాగే కలుషిత తాగునీటి వల్ల ప్రాణాంతకమైన వ్యాధులు సోకే అవకాశాలు ఉన్నాయి. వానాకాలంలో అనారోగ్యం పాలవ్వకుండా ఉండాలంటే కొన్ని ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక):



దోమలకు ఆజ్యం పోస్తున్న మురుగు కాలువ



డ్రైనేజీలో లీకవుతున్న తాగునీటి పైపులైను

దోమల వల్ల వచ్చే వ్యాధులు

మలేరియా, ఫైలేరియా, డెంగీ, మెదడువాపు, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వస్తాయి. నీటిలో పెరిగే ఆడ అనాఫిలిస్ దోమ వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుంది. చలి, వణుకుతో కూడిన జ్వరం, చెమటలు పట్టడం, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే మురుగు నీటిలో పెరిగే దోమకాటు వల్ల ఫైలేరియా సోకుతుంది. దీని వల్ల కాళ్లు, చేతులకు వాపులు వస్తాయి. కాళ్లకు వచ్చిన వాపు దీర్ఘకాలంగా ఉండిపోయే అవకాశం ఉంది. మొదట్లోనే గుర్తించకపోతే జీవితాంతం బాధిస్తుంది. పాత డబ్బాలు, కుండలు, కొబ్బరి చిప్పలు, ఎయిర్ కూలర్లు, పూల కుండీలు, వాహనాల టైర్లు, ట్యూబుల్లో ఉన్న నీటినిల్వల్లో ఏడిస్ దోమ పెరుగుతుంది. ఆ దోమ కాటు వల్ల డెంగీ సోకుతుంది. దీని వల్ల ఎముకలు, కండరాలు, కీళ్ళ నొప్పులతో కూడిన తీవ్రమైన జ్వరం, చర్మంపై మచ్చలు, చిగుళ్లు, ముక్కు, మలం ద్వారా ఎక్కువ శాతం రక్తం పోతుంది. క్యూలెక్స్ దోమ కాటు ద్వారా మెదడువాపు వ్యాధి బారిన పడతాం. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, తల నొప్పి, వాంతులు, స్పృహ కోల్పోవడం జరుగుతుంది. చిన్నారుల్లో ఎక్కువగా మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయి. అలాగే దోమల వల్ల వచ్చే మరో ప్రమాదక వ్యాధి చికున్‌గున్యా. జ్వరం, కీళ్ళల్లో భరించలేనంత నొప్పులు వస్తాయి. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుంది.

కలుషిత నీటి వల్ల..

గ్రామీణ ప్రాంతాలల్లో తాగునీటిని సరఫరా చేసే పైపులైన్లు లీకేజీ కారణంగా నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది. ఫలితంగా డయేరియా(నీళ్ళ విరేచనాలు), కామెర్లు, టైఫాయిడ్, రక్త, బంక విరేచనాలు, అమీబియాసిస్ లాంటి వ్యాధులు సంభవిస్తాయి.

నివారణ చర్యలు

ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు మురుగు కాలువలను శుభ్రం చేసుకోవాలి. గుంటలు, లోతట్టు ప్రదేశాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలి. ఇంటి ఆవరణలో ఉన్న పాత రేకు డబ్బాలు, కుండలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, లాంటి వాటిలో నీరు లేకుండా చూసుకోవాలి. దోమలు కుట్టకండా ఇళ్లలో దోమ తెరలను వాడాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆహారం తినే ముందు, మలమూత్ర విసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. కాచి చల్లార్చి, వడబోసిన నీటినే తాగాలి. శుభ్రంగా కడగని కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు, మూతలు పెట్టని ఆహారాన్ని, కలుషితమైన ఆహారాన్ని తినకూడదు. ఆహార పదార్థాలపై బొద్దింకలు, ఈగలు, దోమలు వాలకుండా చూసుకోవాలి. రైతులు, కూలీలు చెరువులు, కుంటలు, కాలువల్లో పారే నీటిని తాగకుండా ఉండటం మంచిది.

ముందస్తు జాగ్రత్తలే రక్ష



వర్షాకాలంలో సీజన్ వ్యాధుల బారిన పడేకంటే ముందస్తు జాగ్రత్తలు పాటించడం చాలా మంచిది. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరి చేరవు. వ్యాధుల భారిన పడిన వారు ఆలస్యం చేయకుండా దగ్గరలో ఉన్న ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకోవాలి. కలుషిత నీటితో సంభవించే డయేరియా రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. సీజన్‌లో వచ్చే వ్యాధులపై ఇంటింటా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నాం. వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నాం.

– డా.సమీనా సుల్తానా, పీహెచ్‌సీ, మిరుదొడ్డి

యూరియా నిల్వచేస్తే ఉపేక్షించేది లేదు

ఏడీఏ బాబునాయక్



యూరియా పరిశీలిస్తున్న బాబునాయక్

దుబ్బాకటౌన్: ఎరువుల దుకాణ యజమానులు యూరియా నిల్వచేస్తే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ హెచ్చరించారు. రాయపోల్ ఎరువుల దుకాణాలలో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు విత్తనాలు, ఎరువులను ఎంఆర్‌పీ ధరలకంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు డీలర్లు తప్పకుండా రశీదులు ఇవ్వాలని, స్టాక్ వివరాలు, ధరల పట్టికలను దుకాణాల వద్ద ఉంచాలని సూచించారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగుమందులు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేశ్, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తప్పని తిప్పలు

చిన్నకోడూరు(సిద్దిపేట): యూరియా కోసం అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. చిన్నకోడూరులో రైతు సహకార సంఘం వద్ద మంగళవారం యూరియా కోసం రైతులు ఉదయం నుంచే బారులు తీరారు. ఒక బస్తాకోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందిని వాపోయారు.

పాలిటెక్నిక్ కాలేజీ వరకు రోడ్డు వేయాలి

– పీడీ జయదేవ్ ఆర్య

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వరకు రోడ్డు వేయాలని డీఆర్‌డీఏ పీడీ జయదేవ్ ఆర్య ఆదేశించారు. పీఆర్ డీఈ మహేశ్‌తో కలిసి మంగళవారం ఆయన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. 14న ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభోత్సవం ఉన్నందున కాలేజీ వరకు సీసీ రోడ్డు పనులు వేగిరం పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కాలేజీ వరకు సీసీ రోడ్డుకు రెండు పక్కలా మొక్కలు నాటించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. వారి వెంట టీఏ పరశురాములు తదితరులు ఉన్నారు.

తాగునీటికి 'భగీరథ ప్రయత్నం'



ఖాళీ బిందెలు, డబ్బాలతో గ్రామస్తుల నిరసన

మిరుదొడ్డి(దుబ్బాక): తాగునీటి సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గుక్కెడు నీళ్ల కోసం నానాపాట్లు పడాల్సి వస్తోందని మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామస్తులు వాపోయారు. గ్రామంలో మహిళలు మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీకి చెందిన వాటర్ ట్యాంక్ ద్వారా తూతూమంత్రంగా నీటిని సరఫరాచేసి చేతులు దులుపుకుంటున్నారని, ట్యాంకర్ నీరు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేసేది లేక వ్యవసాయ బోరు బావులను ఆశ్రయించాల్సి వస్తుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని వేడుకొంటున్నారు.

సోషల్ మీడియాతో అప్రమత్తం

ఏసీపీ రవీందర్‌రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సోషల్ మీడియాతో జాగ్రత్తగా ఉండాలని, మన తప్పిదాల వల్లే సైబర్ మోసాలు జరుగుతున్నాయని ఏసీపీ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం పలుచట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేస్తే స్పందించవద్దని, లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ మోసాల బారిన పడితే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీసులంటే భయం వీడాలని, ఏదైనా సమస్య ఉంటే ధైర్యంగా ఫిర్యాదు చేయాలని చెప్పారు. షీ టీమ్ ప్రాముఖ్యత, నిర్వహించే విధులు, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బాడ్ టచ్, మహిళా చట్టాలు, స్వీయ రక్షణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరైనా అవహేళనగా మాట్లాడినా, వెంబడించినా, వేధించినా వెంటనే డయల్ 100, సిద్దిపేట షీ టీమ్ నంబర్ 87126 67434కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ దుర్గ, ట్రాఫిక్ ఎస్ఐ విజయభాస్కర్, హెచ్ఎం మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎం ఫొటో ఏర్పాటు చేస్తాం..

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్



మాట్లాడుతున్న అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): త్వరలోనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొన్ని కార్యాలయాల్లో సీఎం ఫొటో ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. బాధ్యతగా తీసుకొని సీఎం ఫొటో ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానున్న స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని చెప్పారు.

తల్లిపాలు శిశువు ఆరోగ్యానికి మేలు

ఆస్పత్రి సూపరింటెండెంట్ అన్నపూర్ణ



గజ్వేల్: మాట్లాడుతున్న సూపరింటెండెంట్ అన్నపూర్ణ

గజ్వేల్: తల్లిపాలే శిశువు ఆరోగ్యానికి ఎంతో మేలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె ప్రసంగించారు. పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి పాలు తాగించాలని, దాని వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అనంతరం సీడీపీఓ సరిత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు ప్రతి రోజు పాలు, ఇతర పౌష్టికాహారం అందజేస్తున్నామని, ఆరు నెలల తర్వాత శిశువుకు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ స్నేహ ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమారస్వామి, మహిళా ఉపాధ్యక్షురాలు డాక్టర్ శైలజ, ఆర్ఎంఓ రాము, వైద్యులు సాయికిరణ్, సుజాత పాల్గొన్నారు.

పోసాన్‌పల్లిలో ..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని పోసాన్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ ఉమాదేవి మాట్లాడుతూ తల్లిపాలు పిల్లలకు అమృతంతో సమానమని, ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు. యూపీఎస్ హెచ్ఎం రాంకిషన్, పంచాయతీ కార్యదర్శి జావేద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో..



చిన్నకోడూరులో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులో నిర్వహించిన కార్యక్రమంలో సీడీపీఓ రేణుక పాల్గొన్నారు. ఆమె మాట్లాడతూ తల్లిపాలు పట్టించడం వల్ల పిల్లలకే కాకుండా తల్లులకు కూడా చాలా మంచిదన్నారు. తల్లిపాల ప్రయోజనాల గురించి అవగాహన కల్పించారు. మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీలో చేర్పించాలని సూచించారు. సూపర్‌వైజర్ మహాలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ భూమవ్వ, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రెవెన్యూ డివిజన్ ప్రాధాన్యం వివరించండి

చేర్యాల(సిద్దిపేట): రెవెన్యూ డివిజన్ ప్రాధాన్యం గురించి ప్రతి పాఠశాలలోను విద్యార్థులకు వివరించాలని డివిజన్ జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగల్ల పరమేశ్వర్ హెచ్ఎంలను కోరారు. జేఏసీ ఆధ్వర్యంలో 12న తలపెట్టిన విద్యా సంస్థల బంద్‌కు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. నాయకులు అశోక్, బీరయ్య, సత్యనారాయణ, బాలనర్సయ్య, చంద్రం, వెంకటాద్రి, రాజిరెడ్డి, భూమయ్య పాల్గొన్నారు.

◆ సీసీ కెమెరాలే కీలకం

తొగుట(దుబ్బాక): గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చాలా కీలకమని, యువత సహకరించాలని సీఐ ఎస్‌కే లతీఫ్ కోరారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి గౌడ్ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. కెమెరాల ఏర్పాటుకు సహకరించిన భిక్షపతిగౌడ్, అంజనేయులుగౌడ్, పరశురాములుగౌడ్‌లను సన్మానించారు. ఎస్ఐ రవికాంత్‌రావు, వీపీఓ సంతోష్, నాగరాజు పాల్గొన్నారు.

◆ చదువుతోనే ఉజ్వలమైన భవిష్యత్

గజ్వేల్‌రూరల్: చదువుతోనే ఉజ్వలమైన భవిష్యత్ సాధ్యమని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిత అబ్రహం అన్నారు. మండల పరిధిలోని కొడకండ్ల ఉన్నత పాఠశాల విద్యార్థినులు మంగళవారం డిగ్రీ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి మహిళల సాధికారత, లింగ సమానత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వైస్ ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన, లక్ష్మీ, జయరాజు, బాల్‌చంద్రం తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

సిద్దిపేటకమాన్: గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టిన ఘటనల్లో బాధితులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు రూ.2 లక్షలు, తీవ్ర గాయాలైన వారికి రూ.50 వేలు సాయం అందజేయనున్నట్లు తెలిపారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక(గజ్వేల్): మండలంలోని కేజీబీవీ బాలికల హాస్టళ్లలో వెట్ స్వీపర్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. 6 నుంచి 8వ తేదీలోగా దరఖాస్తులు అందజేయాలని, మండలానికి చెందిన వారు మాత్రమే అర్హులని చెప్పారు. అలాగే మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లలో అసిస్టెంట్ కుక్ పోస్టులకు 19 నుంచి 23లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

◆ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

గజ్వేల్‌రూరల్: జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్‌వీ కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్ ఉత్తీర్ణులైన వారితోపాటు ఉత్తీర్ణులు కానివారు, పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99513 76362, 96768 41339 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

◆ సమస్యలు పరిష్కరించాలని నిరసన

జగదేవ్‌పూర్(గజ్వేల్): కుకునూర్‌పల్లి మండలం రాయవరంలో చాలా సమస్యలు ఉన్నాయని, పారిశుద్ధ్య పనులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. కార్యదర్శి మంగళవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామస్తులు నిరసన తెలిపారు. మూడు నెలల నుంచి వీధి దీపాలు వేయడం లేదని, వారం రోజులుగా తాగునీరు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎల్లం, కనకరాజు, గణేశ్, పరశురాములు, శ్రీశైలం పాల్గొన్నారు.

◆ ఐక్యత చాటుతాం

నంగునూరు(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసికట్టుగా పనిచేసి ఐక్యత చాటాలని ముదిరాజ్ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. నంగునూరులో మంగళవారం ఆ సంఘం గ్రామశాఖ అధ్యక్షుడు ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించేలా పని చేస్తామన్నారు. శ్రీను, రాజు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ చదువుకు అంతరాయం కలిగించొద్దు

కొమురవెల్లి(సిద్దిపేట): పిల్లల చదువుకు అంతరాయం కలిగే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని ప్రాథమిక పాఠశాల కమిటీ మాజీ చైర్మన్ మంకాల సతీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఏంఈఓ రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు.

◆ నార్కోటిక్ సోదాలు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల పీఎస్ పరిధిలో భూంపల్లి ఎస్ఐ హరీశ్ ఆధ్వర్యంలో మంగళవారం యాంటీ నార్కోటిక్ డ్రగ్స్‌లో భాగంగా డాగ్ స్క్వాడ్‌తో పలు హోటళ్ళు, కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో సోదాలు నిర్వహించారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వివిధ దుకాణాల్లో విక్రయించినా, కొనుగోలు చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ నానో యూరియాను వాడాలి

తొగుట(దుబ్బాక): నానో యూరియా, డీఏపీని వినియోగించడం వల్ల చాలా ప్రయోజనాలున్నాయని దుబ్బాక ఏడీఏ మల్లయ్య సూచించారు. మండలంలోని పెద్ద మాసాన్‌పల్లి రైతు వేదికలో ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కో–ఆపరేటివ్ సంస్థ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నానో యూరియా డాప్ వినియోగంపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొడి యూరియా, డీఏపీ మొక్కలకు 30 నుంచి 40 శాతం మాత్రమే ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఓ మోహన్, ఇఫ్కో ఏరియా మేనేజర్ చంద్రబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ మహిపాల్‌రెడ్డి, ఏఈఓలు నాగార్జున, దేవేందర్, సాయికుమార్ రైతులు పాల్గొన్నారు.